సాక్షి
ప్రకాశం

శుక్రవారం : 26 : జూలై : 2024



నేర నియంత్రణకు ముమ్మర గస్తీ

నేరాలను నియంత్రించేందుకు గస్తీని ముమ్మరం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ దామోదర్ ఆదేశించారు. పలు పోలీస్‌స్టేషన్‌లను గురువారం తనిఖీ చేశారు.

- 8లో..



నేటి నుంచి అదనపు పొగాకు కొనుగోళ్లు

అదనపు పొగాకు కొనుగోళ్లపై జరిమానాలను రద్దు చేసి నేటి నుంచి కొనుగోలు చేయనున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పొగాకు చూర రూ.185

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొదిలి, టంగుటూరు పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం కొనుగోళ్లు జరిగినట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. టంగుటూరు కేంద్రంలో పొగాకు చూర కేజీ గరిష్ట ధర రూ.185, కనిష్ట ధర రూ.60 పలికినట్లు చెప్పారు. రెండు కేంద్రాల్లో 1,097 బేళ్ల చూర వేలానికి రాగా, 876 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 221 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. పొదిలి కేంద్రంలో 108వ రోజు వేలం పాటలో 491 బేళ్ల వేలానికి రాగా, 342 బేళ్లు కొనుగోలయ్యాయి. 149 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇక్కడ కేజీ గరిష్ట ధర రూ.143, కనిష్ట ధర రూ.60, సరాసరి ధర రూ.69.12 పలికింది. టంగుటూరు వేలం కేంద్రంలో 114వ రోజు వేలం పాటలో 606 బేళ్లు వేలానికి రాగా, 534 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 72 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇక్కడ కేజీ గరిష్ట ధర రూ.185, కనిష్ట ధర రూ.60, సరాసరి ధర రూ.97.57 పలికినట్లు ఆర్ఎం వివరించారు.

అక్రమాలపై ఆర్‌డీఎం విచారణ



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డీఎం శోభారాణి

ఒంగోలు టౌన్: వైద్యారోగ్యశాఖలో 2002 నుంచి హెల్త్ అసిస్టెంట్ల నియామకాలలో జరిగిన అక్రమాలపై గుంటూరు జోనల్ ఆర్‌డీఎం అండ్ డీఎం అండ్ హెచ్ఎస్ డాక్టర్ శోభారాణి గురువారం విచారణ చేపట్టారు. నియామకాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పరిశీలించారు. ఆర్‌డీఎం శోభారాణితో పాటు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కార్యాలయ బృందం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి హెల్త్ అసిస్టెంట్ల నుంచి డిక్లరేషన్లు తీసుకున్నారు. తదుపరి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వారు తెలిపారు. విచారణలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్ పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన కేసులో భార్యకు యావజ్జీవ శిక్ష

ఒంగోలు టౌన్: ప్రియుడి మోజులో పడిన ఒక వివాహిత తల్లి, ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను హతమార్చింది. ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ ఒంగోలు కోర్టు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. త్రిపురాంతకం మండలంలోని గుట్లల ఉమ్మడివరం గ్రామానికి చెందిన యు.చిన్నఆంజనేయులు (28), అదే మండలంలోని అన్నసముద్రం గ్రామానికి చెందిన ఎస్.బాలచెన్నయ్య బెంగళూరులో బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవారు. 2015 జనవరిలో సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వచ్చిన ఇద్దరు మిత్రులూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి ఆంజనేయులు బెంగళూరు వెళ్లిపోయాడు. చెన్నయ్య మాత్రం తర్వాత వస్తానని చెప్పి ఊర్లోనే ఉండిపోయాడు. ఆ సమయంలో ఆంజనేయులు భార్య, అత్తతో అతడు సన్నిహితంగా మెలిగాడు. ఈ విషయం తెలుసుకున్న ఆంజనేయులు భార్యను మందలించాడు. అదే ఏడాది జూలై 23వ తేదీ దేకనకొండ గ్రామంలో బంధువుల కర్మకాండకు ఆంజనేయులు వచ్చాడు. అప్పటికే అతడిని హతమార్చాలని పథకం పన్నిన చెన్నయ్య.. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం ఆంజనేయులుతో మద్యం సేవించాడు. కురిచేడు మండలం ఆవులమంద తీసుకెళ్లి తల మీద సుత్తితో కొట్టి యాక్సా బ్లేడుతో గొంతు కోసి క్రూరంగా హతమార్చాడు. అతడికి ఆంజనేయులు భార్య, అత్త సహకరించారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనపై కురిచేడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. అప్పటి దర్శి డీఎస్పీ పీఎస్ రాంబాబు, సీఐ కేవీ రాఘవేంద్ర దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసమూర్తి, జోష్ ఫిన్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. పోలీసు సిబ్బంది సకాలంలో కోర్టులో సాక్షులను హాజరుపరిచారు. సమర్థవంతమైన గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా విచారణ నడిపి నేర నిరూపణ చేశారు. ఒంగోలు స్పెషల్ కోర్టు 7వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజావెంకటాద్రి ముగ్గురు నిందితులకు యావజ్జీవ శిక్ష, వేయి రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన అప్పటి దర్శి డీఎస్పీ పీఎస్ రాంబాబు, నాటి సీఐ రాఘవేంద్రరావు, ప్రస్తుత దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఏ శ్రీనివాసులు, కురిచేడు కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.



నిప్పులు కక్కే ఎండ.. రక్తం గడ్డకట్టే చలి.. వానైనా వరదైనా.. పగలనకా రేయనకా.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి పహారా కాస్తున్న సైనికుల పరాక్రమం గురించి ఎంత చెప్పినా తక్కువే! గుండె చిక్కబట్టి సైనికులు చేసే పోరాటం ముందు తెగిపడే అవయవాలు కూడా సాగిలపడతాయ్.. కొండలు పిండవుతాయ్.. తుపాకీ తూటాలు ముక్కలవుతాయ్. ''జై భవానీ.. జై శివాజీ..'' అంటూ రణభూమిలో గర్జించే భారత సైనిక సింహాల ముందు శత్రువులు తలొంచాల్సిందే.

ఈ దేహం.. దేశం కోసం..

దేశం ప్రజల మానప్రాణాలను రక్షించడంలో, ప్రాణ త్యాగానికి సైతం ముందు వరుసలో ఉంటున్నారు పశ్చిమ ప్రకాశం వాసులు. యుద్ధభూమిలో ప్రాణాలు కోల్పోయినవారు, శరీర భాగాలు తెగిపడి దివ్యాంగులుగా మిగిలిన వారూ పశ్చిమ ప్రకాశంలో అధికంగానే ఉన్నారు. అయినప్పటికీ నేటి తరం యువత అమితమైన దేశ భక్తితో ప్రాణాలకు వెరవకుండా సైన్యంలో చేరేందుకు ఉవిళ్లూరుతున్నారు. నేడు కార్గిల్ దివస్ సందర్భంగా సైనికుల సేవలను స్మరించుకుందాం.



క్రిష్ణంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జవాన్ సంజీవరెడ్డి విగ్రహం

- దేశ సేవలో ముందున్న పశ్చిమ ప్రకాశం వాసులు
- జిల్లాలో 36 మంది అమరవీరులు
- ఒక్క కంభం మండలంలోనే ఆరుగురు..
- నియోజకవర్గంలో 11 వేలకు పైగా మాజీ సైనికులు
- కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ ప్రవేశపెట్టడంతో తగ్గిపోతున్న జవాన్లు
- ఆర్మీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్న మాజీ సైనికులు
- నేడు కార్గిల్ దివస్

కంభం:

భారత త్రివిధ దళాలతోపాటు కోస్ట్‌గార్డ్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, పారా మిలిటరీ బలగాలైన బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, అసోం రైఫిల్స్ దళాల్లో జిల్లాకు చెందిన వేలాది మంది ప్రాతినిధ్యం వహిస్తూ దేశ రక్షణలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు ఆర్మీలో చేరేందుకు ఎప్పుడూ ఉవిళ్లూరుతుంటారు. గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 5 వేల మంది ప్రస్తుతం ఆర్మీలో విధులు నిర్వహిస్తుండగా, 11 వేల మందికిపైగా మాజీ సైనికులు ఉన్నారు.

భీతి లేని రణ నీతి

దేశంపైకి దండెత్తి వచ్చిన శత్రు సైనాన్ని తుద ముట్టించే క్రమంలో జిల్లాకు చెందిన 36 మంది సైనికులు వీర మరణం పొందారు. అందులో గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన 18 మంది సైనికులు ఉండగా, ఒక్క కంభం మండలానికి చెందిన వారు ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 24 ఏళ్ల కిందట సరిగ్గా ఈరోజు అంటే జూలై 26వ తేదీ కార్గిల్ యుద్ధంలో భారత్ విజయబావుటా ఎగురవేసింది.



కార్గిల్ యుద్ధంలో అమరుడైన కంభం మండలం ఎల్.కోటకు చెందిన జి.శ్రీనివాసులు (ఫైల్)

దాయాదిదేశం పాకిస్థాన్ కార్గిల్‌ను ఆక్రమించుకునేందుకు ''కోహ్-ఇ-హైమా'' ఆపరేషన్‌ను చేపట్టింది. దీనిని భారత జవాన్లు తిప్పికొట్టారు. ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ సఫేద్ సాగర్ పేరుతో భారత దళాలు పాకిస్థాన్‌పై భీకర దాడులు చేయడంతో పాకిస్థాన్ తోక ముడిచింది. పాక్ మూకలను తిప్పి కొట్టే క్రమంలో వందలాది మంది భారత సైనికులు వీర మరణం పొందారు. వారిలో కంభం మండలం ఎల్.కోట గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు ఒకరు.

అగ్నివీర్‌తో నష్టం

గతంలో ఆర్మీకి ఎంపికైన వారికి ఏడాదిన్నర నుంచి మూడేళ్ల వరకు శిక్షణ ఇచ్చేవారు. కనీస సర్వీసు 16 ఏళ్లు కాగా ఆసక్తి ఉన్న వారు 30 ఏళ్లు పని చేసి రిటైర్ అవుతారు. వారు పూర్తి స్థాయిలో శిక్షణ పొందినందున ఏ విపత్తు వచ్చినా ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉండేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ విధానంతో యువత తీవ్రంగా నష్టపోతోంది. అగ్నివీర్‌లో ఎంపికైన వారికి ఆరు నెలల శిక్షణ ఇచ్చి నాలుగేళ్లకే ఇంటికి సాగనంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్మీలో చేరేందుకు యువత ఆసక్తి చూపడం లేదు. పాత పద్ధతిలోనే ఆర్మీ నియామకాలు కొనసాగిస్తే దేశానికి మంచిదని మాజీ సైనికులు సైతం అభిప్రాయపడుతున్నారు.



గతనెలలో సైనిక విన్యాసాల్లో మృతి చెందిన జేసీఓ ముత్తుముల రామకృష్ణారెడ్డి భౌతికకాయానికి గౌరవ వందనం చేస్తున్న ఆర్మీ అధికారులు



మంచు కొండల్లో సైనికులు

వీరులారా వందనం

- ఈ ఏడాది జూన్‌లో తూర్పు లడ్డాఖ్ సమీపంలో నిర్వహిస్తున్న సైనిక విన్యాసాల్లో యుద్ధ ట్యాంక్ నీటిలో కొట్టుకుపోయి ఐదుగురు జవాన్లు చనిపోగా అందులో రాచర్ల మండలానికి చెందిన జేసీఓ ముత్తుముల రామకృష్ణారెడ్డి ఉన్నారు. కొద్ది నెలల్లో రిటైర్ కావాల్సిన ఆయన సైనిక విన్యాసాల్లో ప్రాణాలు విడిచారు.
- గిద్దలూరు మండలం కిష్టంశెట్టి పల్లి గ్రామానికి చెందిన సంగిరెడ్డి సంజీవరెడ్డి మూడేళ్ల క్రితం సిక్కింలో మంచు కొండల్లో మృతి చెందారు.
- కంభంకు చెందిన నంద్యాల శ్రీనివాసులు 2004లో శ్రీనగర్‌లో జరిగిన ఆపరేషన్ రక్షక్‌లో అమరుడయ్యారు. ఆయన మరణించే నాటికి భార్య వకులాదేవి 6 నెలల గర్భిణి. నంద్యాల శ్రీనివాసులుకు మరణానంతరం విశిష్ట సేవా మెడల్ దక్కింది.
- కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన పత్తి వెంకట నారాయణ 1988లో శ్రీలంకలో చేపట్టిన ఆపరేషన్ పవన్‌లో పాల్గొన్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన ఆయనకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.



పత్తివెంకటనారాయణ ఫొటోతో భార్య పత్తి ఆదిలక్ష్మి

- కంభం మండలం తురిమెళ్లకు చెందిన సీహెచ్ రంగస్వామి 1962లో చైనా యుద్ధంలో, ఎం.రంగారెడ్డి 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందారు. కంభం పట్టణానికి చెందిన జి.గాలెయ్య 2006లో ఆపరేషన్ రక్షక్‌లో తుది శ్వాస విడిచారు.

సేవల్లో మాజీ సైనికులు

జిల్లాలోని మాజీ సైనికులు పోలీసులతో కలిసి ఎన్నికల విధుల్లో పాలుపంచుకుంటున్నారు. విద్యా సంస్థలు, పరిసరాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు తమ వంతుగా నోట్‌పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.

ఇవీ మాజీ సైనికుల డిమాండ్లు

- పశ్చిమ ప్రకాశంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు.
- రేషన్ కార్డు స్థానంలో డిఫెన్స్ వెల్ఫేర్ కార్డు(రేషన్, వైద్య సేవల రహితంగా).
- వలంటీర్స్‌గా మాజీ సైనికుల సేవలు వినియోగించుకోవాలి.
- మాజీ సైనికుల కార్యాలయం కోసం స్థలం మంజూరు చేయాలి.



దేశ సేవ చేయడం గర్వంగా ఉంది

1984 నుంచి 2014 వరకు ఆర్మీలో విధులు నిర్వహించా. 1999లో కార్గిల్ యుద్ధం తోపాటు 2003లో ఆపరేషన్ రక్షక్, 2004లో ఆపరేషన్ దివార్‌లో పాల్గొన్నా. 2011-14 వరకు డీఆర్‌డీఓలో భాగంగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం వద్ద విధులు నిర్వహించా. నా ఇద్దరు అల్లుళ్లు ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్నారు. 30 ఏళ్ల పాటు దేశం కోసం ఆర్మీలో సేవలందించడం ఎంతో గర్వంగా ఉంది.

– ఎస్ఎం బాషా, రిటైర్డ్ సుబేదార్ మేజర్



సెంట్రల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

సైనికులు, మాజీ సైనికుల పిల్లలు అధికంగా ఉన్న పశ్చిమ ప్రకాశంలో సెంట్రల్ స్కూల్, ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేయాలి. మాజీ సైనికులకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించాలి. మాజీ సైనికులు వారి సమస్యలపై సమావేశాలు నిర్వహించుకునేందుకు కార్యాలయం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలి.

– శెట్టం వేణుగోపాల్‌రావు, రిటైర్డ్ సుబేదార్ మేజర్



ఆర్మీ సెలెక్షన్ పాత పద్ధతిలోనే మంచిది

పశ్చిమ ప్రకాశంలో ఎంతో మంది యువకులు ఆర్మీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అగ్నివీర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే సైనికుల ఎంపికను కొనసాగించాలి. అగ్నివీర్ పద్ధతి ఇష్టం లేని యువకులు ఆర్మీలో చేరేందుకు ఆసక్తి కనబరచడం లేదు.

– సంకతాల ప్రసాద్



ఆపరేషన్ రక్షక్‌లో కన్నుమూసిన కంభంవాసి నంద్యాల శ్రీనివాసులు(ఫైల్)

గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

యర్రగొండపాలెం: గిరిజనుల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలోని చెంచుగిరిజన పునరావాస కాలనీలో గురువారం ఆమె పర్యటించారు. చెంచులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి సమస్యలడిగి తెలుసుకున్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించదగిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆమె అన్నారు. తమ కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడంలేదని, ట్యాంకర్ల సంఖ్య పెంచి నీటి సమస్య పరిష్కరించాలని పలువురు చెంచులు కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం తమకు కేటాయించిన ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో సాగునీటి వసతి కల్పించాలని వారు కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తక్షణమే నీటి ట్యాంకర్ల సంఖ్య పెంచుతామని, అటవీ శాఖాధికారులతో చర్చించి సాగు భూముల్లో బోర్లు వేసి వ్యవసాయానికి నీటి వసతి కల్పించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. జిల్లాలో ఏడు మండలాల పరిధిలో ఉన్న పీటీజీ గిరిజన ప్రాంతాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ, తాగునీటి కోసం బోర్‌వెల్స్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆయా ఆవాసాల వారీగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి తనకు నివేదించాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. జీవనోపాధి కోసం తమకు 5 ఎకరాల సాగు భూమితోపాటు నివేశన స్థలం కేటాయిస్తే కోర్ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతంలోకి రావడానికి గిరిజనులు ఇష్టపడుతున్నారని, అందుకు గల అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముందుగా స్థానిక ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ మొక్క నాటారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎల్‌డీవో బి.వి.ఎన్.సాయికుమార్, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, వెంకటాద్రిపాలెం సర్పంచ్ శ్రీశైలం, ఏపీవోలు నాగేశ్వరరావు, శైలజ, సీడీపీవో పద్మావతి, ఎంఈవో మల్లు నాయక్, ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.



చెంచులతో మాట్లాడుతున్న కలెక్టర్

డిజిటల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరం

- జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ

ఒంగోలు సెంట్రల్:

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఛాత్రోపాధ్యాయులు అవగాహన పెంచుకుని ఎప్పటికప్పుడు నేర్చుకుని ముందంజలో ఉండాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ పిలుపునిచ్చారు. డిజిటల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై మైనంపాడు డైట్ కళాశాలలో గురువారం ఛాత్రోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ పాల్గొని మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ సైట్‌లో ఛాత్రోపాధ్యాయులు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ నాయక్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే స్కిల్‌ను ఎలా పెంచుకోవాలో చెప్పారు. భవిష్యత్‌లో కాబోయే ఉపాధ్యాయులు అయినందున అవగాహన సదస్సు నిర్వహించి టెక్నాలజీపై మరింత అవగాహన పెంచుకునేందుకు తోడ్పడుతున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు, లెక్చరర్లు ఆర్.శ్రీనివాసులు, ఎం.రవీంద్రప్రసాద్ నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఉపయోగాల గురించి వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

నాణ్యతా లోపంపై కలెక్టర్ ఆగ్రహం

- ఉపాధ్యాయులు, హెచ్ఎం, ఎంఈఓ పనితీరుపై అసహనం
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆదేశం

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధించే విద్యతో పాటు వారికి అందించే భోజనంలో కూడా నాణ్యత లేకపోవడంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పాఠ్యపుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో చదివించి వారిలోని విద్యాప్రమాణాల స్థాయిని గమనించారు. తరగతులకు తగినట్లుగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు లేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా సిద్ధం చేసిన పులిహోరను కలెక్టర్ రుచి చూశారు. పులిహోర రుచికరంగా లేకపోవడంతో హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు ఆహార పదార్థాల రుచి, నాణ్యతను హెచ్ఎం కచ్చితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులెవరూ బడి మానివేయకుండా చూడాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. పాఠశాలలోని మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేరని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

ఎంఈవోపై కలెక్టర్ ఆగ్రహం...

పుల్లలచెరువులో ఎంఈవోలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యంగా, రుచిగా ఉంటుందా..లేదా..? అనే విషయాన్ని ఎంఈఓలు తనిఖీ చేయడం లేదంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముటుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగలేదని, ఎంఈఓలు భోజనాన్ని తనిఖీ చేస్తే అలా ఎందుకు ఉంటుందని కలెక్టర్ నిలదీశారు. ప్రతిరోజూ తప్పనిసరిగా మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తాను త్వరలో మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని ఎంఈఓలను కలెక్టర్ హెచ్చరించారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోకి సిద్ధం చేసిన పులిహోరను రుచి చూస్తున్న కలెక్టర్

లా పరీక్ష ఫలితాలు విడుదల

ఒంగోలు సెంట్రల్:

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలో లా మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం వైస్ చాన్సిలర్ (వీసీ) ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి విడుదల చేశారు. విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు న్యాయ కళాశాలల్లో మూడు సంవత్సరాల లా కోర్సు పరీక్షలకు 320 మంది విద్యార్థులు హాజరవగా, 223 మంది ఉత్తీర్ణులై 69.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వీసీ వెల్లడించారు. అదేవిధంగా ఐదు సంవత్సరాల లా కోర్సుకు సంబంధించి 64 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 40 మంది పాసై 62.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల పీజీ లా కోర్సు పరీక్షకు 44 మంది విద్యార్థులు హాజరవగా, 40 మంది పాసై 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కేవీఎన్ రాజు తెలిపారు. మొదటి సెమిస్టర్ లా పరీక్ష ఫలితాల్లో స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వీసీ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్, సీటీఏ డాక్టర్ జి.సోమశేఖర్, ఏసీటీఏ డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్, తదితరులు

క్లుప్తంగా

ఆహ్లాదకర వాతావరణంలో చదువుకోవాలి

● జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర



మద్దిపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

మద్దిపాడు: విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకోవాలని డీఈఓ సుభద్ర అన్నారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు పరిసరాలపై కూడా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలో చెట్లు పెంపకంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పచ్చని చెట్ల ప్రాముఖ్యను వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. డీఈఓ వెంట సీఎంఓ శ్రీనివాసరావు, ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు పొగాకుపై జీరో పెనాల్టీ సడలింపు

● టుబాకో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం

టంగుటూరు: పొగాకు అదనపు కొనుగోలుకు జీరో పెనాల్టీ సడలించినట్లు టుబాకో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. స్థానిక వేలం కేంద్రాన్ని గురువారం ఆర్‌ఎం సందర్శించి, వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలం ఉత్పత్తిదరుల, సాగుదారులకు సమావేశం నిర్వహించి 27 నుంచి అదనపు కొనుగోలుకు అనుమతిచ్చిందని, ఈ సడలింపు ప్రస్తుత పంట కాలానికే అని స్పష్టం చేశారు. అదనంగా ఎరువులు ఇతర ఇన్‌పుట్ల కోసం ఇండెంట్లను బోర్డుకు సమర్పించాలని సూచించారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు ముమ్మర గస్తీ

● ఎస్పీ ఏఆర్ దామోదర్



తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ముండ్లమూరు: నేరాల నియంత్రణకు గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించాలన్నారు. సిబ్బంది నిత్యం యూనిఫారంలోనే ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. యూనిఫాం ధరించినపుడు తప్పనిసరిగా మీ పేరు కనిపించేలా నేమ్ ప్లేట్ ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో సిబ్బంది నీట్‌గా, హుందాగా వ్యవహరించాలన్నారు. స్టేషన్‌లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నియంత్రణకు వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి స్టేషన్‌లో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. స్టేషన్‌లో ఆవరణలో ఉన్న కొండమ్మతో కాసేపు ముచ్చటించి సమస్యలు, బాగోగుల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, సిబ్బంది మరియబాబు, మహేష్, పున్నారావులు ఉన్నారు.

దర్శి: రాజకీయ పార్టీలను పక్కన పెట్టి పోలీసులు నిజాయితీగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సై సుమన్, ఏఎస్సై శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీపై ప్రత్యేక దృష్టి

తాళ్లూరు(ముండ్లమూరు): రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల చోరీ నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నేరాల నియంత్రణకు సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శించి అనుమానితులపై నిఘా పెట్టాలన్నారు. ఎస్సై కె.విజయకుమార్, ఏఎస్సై మోహనరావు, సిబ్బంది బ్రహ్మనాయుడు, నాగలక్ష్మి ఉన్నారు.

నేటి నుంచి అదనపు పొగాకు కొనుగోళ్లు

● అదనపు పొగాకు కొనుగోళ్లపై జరిమానా రద్దు చేసిన బోర్డు
● నెల రోజుల విరామం అనంతరం తిరిగి కొనుగోళ్లు ప్రారంభం



పొగాకు బేళ్లు

కందుకూరు: నిన్నటి వరకు బోర్డు నిర్ణయం కోసం ఉత్కంఠగా ఎదురుచూసిన రైతులకు పొగాకు బోర్డు చల్లని కబురు చెప్పింది. అదనంగా పండించిన పొగాకు ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి బోర్డు నిర్ణయం తీసుకోవడంతో దీంతో దాదాపు నెల రోజులుగా నిలిచిన పొగాకు కొనుగోళ్లు తిరిగి శుక్రవారం నుంచి ప్రారంభకానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆలస్యమైన పొగాకు వేలం ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అదనపు పొగాకు కొనుగోళ్ల జరిమానా రద్దు

అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ ఏడాది అధికంగా పొగాకు సాగు చేశారు. బోర్డు అనుమతిని మించి భారీగానే పొగాకు పండించారు. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో 11 కేంద్రాల పరిధిలో దాదాపు 89 మిలియన్ కేజీ పొగాకు ఉత్పత్తులను పండించుకునేందు అనుమతి ఉంటే బోర్డు అధికారుల అంచనా ప్రకారం 139 మిలియన్ కేజీల వరకు పొగాకు పండించారు. ఈ నేపథ్యంలో అధికారిక అమ్మకాలు దాదాపు నెల రోజుల క్రితమే పూర్తి అయ్యాయి. అయితే అదనంగా పండించిన పొగాకు కొనుగోళ్లకు సంబంధించి నిన్నటి వరకు బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి అదనంగా పండించిన పొగాకు ఉత్పత్తులను బోర్డు 5శాతం జరిమానాతో కొనుగోలు చేస్తుంది. గతేడాది ఈ పొగాకు కొనుగోళ్లపై అప్పటి ప్రభుత్వం చొరవతో బోర్డు జరిమానాను రద్దు చేసింది. దీంతో అధికారిక ఉత్పత్తులతో సమానంగా అదనపు పొగాకును అమ్ముకునే వెసులుబాటు రైతులకు వచ్చింది. కానీ ఈ ఏడాది అదనపు పొగాకు కొనుగోళ్లకు సంబంధించి బోర్డు నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చోటు చేసుకుంది. దీంతో నెల రోజుల క్రితమే అధికారిక ఉత్పత్తుల కొనుగోళ్లు పూర్తయినా బోర్డు నిర్ణయం వెలువడకపోవడంతో అన్ని వేలం కేంద్రాల్లోనూ కొనుగోళ్లు నిలిచిపోయాయి. నెల రోజులపాటు పొగాకు చూర, ముక్క వంటివి కొనుగోలు చేసేందుకు మాత్రమే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం అదనపు పొగాకు ఉత్పత్తుల కొనుగోళ్లపై విధించే జరిమానాను రద్దు చేస్తూ బోర్డు రైతులకు ఉపసమనం కలిగించింది. దీంతో రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులను నేటి నుంచి కొనుగోలు చేయనున్నారు. దాదాపు నెల రోజుల విరామం అనంతరం అన్ని వేలం కేంద్రాల్లోను అధికారికంగా వేలం ప్రారంభం కానుంది.

రైతుల వద్ద ఇంకా భారీ ఉత్పత్తులు

కందుకూరు ప్రాంతంలో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున పొగాకును పండించారు. ఇప్పటికే ఒకటవ వేలం కేంద్రంలో 9.2మిలియన్ కేజీలు, రెండవ వేలం కేంద్రంలో 7.9మిలియన్ కేజీల అధికారిక ఉత్పత్తులు కొనుగోళ్లు పూర్తి అయ్యాయి. అయితే ఒకటిలో 15.5, రెండులో 13.5మిలియన్ కేజీల వరకు రైతులు పండించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్ద భారీగానే పొగాకు ఉత్పత్తులు నిల్వ ఉన్నాయి. వేలం ఆలస్యం కావడం వల్ల ఉత్పత్తుల నాణ్యత దెబ్బతింటుందనే ఆవేదన రైతులు వ్యక్తం చేస్తున్నారు. కావున వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. అదే సందర్భంలో ఇప్పటికే నాణ్యమైన పొగాకు కిలో రూ 365ల వరకు పలుకుతుండడంతో, ధరలు ప్రస్తుతం పెరుగుతుండడం రైతులకు సంతోషాన్నిచ్చే అంశం. ఈ ఏడాది ధరలు రూ. 400మార్కును తాకుతాయనే ఆశతో రైతులు ఉన్నారు.

నేటి నుంచే కొనుగోళ్లు:

విరామం అనంతరం శుక్రవారం నుంచి వేలం కేంద్రాల్లో రైతుల వద్ద ఉన్న అదనపు పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం. అదనపు ఉత్పత్తులపై జరిమానాను రద్దు చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. బోర్డు ఆదేశాల మేరకు వేలం ప్రారంభించి ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నాం.

కె రాజగోపాల్‌రెడ్డి, వేలం నిర్వహణాధికారి

లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్టు

● టంగుటూరు వాణీనగర్‌లో ఘటన
● ఫిర్యాదు చేసేందుకు భయపడిన తల్లిదండ్రులు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామరాజు, పక్కన సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావు

టంగుటూరు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు కనిగిరి డీఎస్పీ రామరాజు తెలిపారు. టంగుటూరు మండల కేంద్రంలోని వాణీనగర్‌లో నాలుగు రోజుల క్రితం బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిని స్థానికులు చితకబాదారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి వివరాలను గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెల్లడించారు. టంగుటూరు వాణీనగర్‌కు చెందిన ఇత్తడి విజయ్‌కుమార్(55) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలికపై కన్నేశాడు. బాలిక పాఠశాలకు వెళ్లే సమయంలో అప్పుడప్పుడూ టీవీ చూడటానికి విజయ్‌కుమార్ ఇంటికి వెళ్తూ ఉండేది. ఈ క్రమంలో బాలికకు ఇష్టమైన జియోగ్రాఫిక్ చానల్ పెట్టి శరీర భాగాలు తాకుతూ పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఎవరికీ చెప్పొద్దంటూ బెదిరించి పంపేవాడు. ఈ నెల 22వ తేదీ కూడా బాలికను ఇంట్లోకి పిలిపించుకుని బలవంతంగా కోరిక తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ బాలిక వద్దంటూ కేకలు వేయడంతోపాటు చుట్టుపక్కల వారు విని విజయ్‌కుమార్‌ను చితకబాదారు. బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తొలుత ఫిర్యాదు చేసేందుకు వెనుకాడిన బాలిక తల్లిదండ్రులు ఈ నెల 24వ తేదీన పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్సై యు.పున్నారావు కేసు దర్యాప్తు చేపట్టారు. టంగుటూరు బైపాస్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా కేసును ఛేదించిన డీఎస్పీ రామరాజు, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్సై యు.పున్నారావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సంతాన లేమికి ఐవీఎఫ్ చక్కటి పరిష్కారం



ఫెర్టీ కేర్ సంతాన నిపుణులు డాక్టర్ ఉజ్వల, డాక్టర్ శ్రావణిరెడ్డి

ఒంగోలు టౌన్: సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు ఐవీఎఫ్ చక్కటి పరిష్కారమని ఫెర్టికేర్‌కు చెందిన సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ ఉజ్వల, డాక్టర్ శ్రావణి తెలిపారు. ప్రస్తుతం మారిన జీవన శైలితో ప్రతి ఆరుగురిలో ఒకరికి సంతాన సమస్యలు వేధిస్తున్నాయని వివరించారు. ఐవీఎఫ్ దినోత్సం సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో భాగంగా ఆహారం, దుస్తులు, మొబైల్ ఫోన్ లాంటివి సంతానలేమికి కారణమవుతున్నాయని తెలిపారు. సంతానం లేని దంపతుల్లో ముఖ్యంగా మహిళలు అనేక అవమానాలకు గురవుతున్నారని, అలాంటి వారికి ఐవీఎఫ్ పద్ధతి ఎంతో ఉత్తమమైందని స్పష్టం చేశారు. పురుషుల్లో మద్యపానం, ధూమపానం, మత్తుపదార్థాలు సంతానలేమికి కారణమవుతున్నాయని, వీటితో పాటుగా బిగుతుగా ఉన్న దుస్తులు ధరించడం, జీన్ ప్యాంట్లు ధరించడం వల్ల కూడా వీర్యకణాల సంఖ్య తగ్గిపోతుందన్నారు. మహిళల్లో ఆలస్యంగా వివాహం చేసుకోవడం, తగినంత వ్యాయామం చేయకపోవడం, హార్మోన్ల అసమతుల్యత లాంటివి సంతానం కలగకపోవడానికి కారణమవుతున్నాయని తెలిపారు. సంతానం లేని దంపతులు వెంటనే వైద్యులను సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు సలహాలను పాటించాలని చెప్పారు. ఐవీఎఫ్ విధానం ద్వారా తమ వైద్యశాలలో ఎంతో మంది నిస్సంతులకు సంతాన భాగ్యం కలిగిందని, ఇప్పుడు వారంతా పిల్లాపాపలతో సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు.

☛ ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని క్లౌపేటలో ఉన్న జాయ్ ఫర్టిలిటీ, ఆంధ్రాలజీ సంతాన సాఫల్య హాస్పిటల్‌లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సంతానం లేని దంపతులకు వైద్యు పరీక్షలు నిర్వహించారు. 32 మంది దంపతులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు. శిబిరంలో డాక్టర్ రాజమ్మ, డాక్టర్ ఝాన్సీ మాథ్యూ, డాక్టర్ నోయల్ వైద్య సేవలను అందించారు.

☛ సౌత్ బైపాస్‌లోని ఆస్టర్ సంఘమిత్ర హాస్పిటల్‌లోని కోమలి ఫెర్టిలిటి సెంటర్లో ఘనంగా ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇక్కడ చికిత్స తీసుకొని సంతానం కలిగిన దంపతులు , పిల్లాపాపలతో కలిసి రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. డాక్టర్ ప్రతిమ మాట్లాడుతూ తమ ఫెర్టిలిటీ సెంటర్లో 200 మందికి పైగా దంపతులకు వైద్య చికిత్స ద్వారా సంతానం కలిగినట్లు చేశామన్నారు. హాస్పిటల్ ఎండి డాక్టర్ రమేష్‌బాబు, గైనకాలజిస్ట్ డాక్టర్ దీప, సీఓఓ డాక్టర్ హరికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సాగర్ జలాలు
సక్రమంగా పంపిణీ చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ముటుకుల సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పుల్లలచెరువు: సాగర్ జలాలను తాగునీటి అవసరాలు తీర్చేలా సమర్థవంతంగా పంపిణీ చేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సాగర్ జలాలతో నింపుతున్న ముటుకులలోని సమ్మర్ స్టోరేజీ చెరువును గురువారం ఆమె సందర్శించారు. సీపీడబ్ల్యూఎస్ పంపు హౌస్, మైక్రోఫిల్టర్లు, క్లోరినేషన్ సంపు విభాగాలను పరిశీలించారు. నీటి పంపిణీ చేసే గ్రామాల వివరాలు, పంపిణీ విభాగ నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ చెరువు నీటిని 23 గ్రామాలకు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మర్దన్‌ఆలీ ఆమెకు వివరించారు. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామానికి నీరు అందిస్తున్నారని, కానీ గ్రామంలో అంతర్గత పైపులైన్లు అందుబాటులోకి రాలేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా అంతర్గత పైపులైన్లు ఏర్పాటుకు టెండర్లు పిలిచినా ఎవ్వరూ ముందుకు రాలేదని, ఈ పథకం 2027 మార్చి వరకు ఉంటుందని, అప్పటి లోగా పైపులైన్లు వేసే పనులు కూడా పూర్తి చేస్తామని మర్దన్‌ఆలీ ఆమెకు వివరించారు. స్టోరేజీ చెరువులోకి పశువులు దిగకుండా దాని చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ పూర్ణచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్‌రావు, డీఈ నవకిషోర్, జేఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలైన క్షతగాత్రుడు

● ఒకరి పరిస్థితి విషమం

కనిగిరి రూరల్: రెండు ఆటోలు ఢీ కొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని కొత్తూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపూడి మండలం వేమవరంకు చెందిన మద్దిన తిరుపతయ్య, తిరుపతమ్మ, శేషమ్మ, వెంకట రమణమ్మలు ఆటోలో నెల్లూరు జిల్లా నర్రవాడలోని వెంగమాంబ గుడికి దర్శనానికి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కనిగిరి సమీపంలో కొత్తూరు క్రాస్ రోడ్డు వద్ద వెలిగండ్ల రోడ్డు వైపు నుంచి వేగంగా వస్తున్న టాటా ఏసీ వాహనం, ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎం తిరుతపయ్య, తిరుపతమ్మ, వెంకట రమణమ్మ, శేషమ్మలతో పాటు, ఆటో డ్రైవర్ రాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో తిరుపతయ్యలకు బలమైన రక్తగాయాలు కాగా, మరో నల్గురికి తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

డీఈఐఈడీ సప్లిమెంటరీ ఫీజు చెల్లించండి

ఒంగోలు సెంట్రల్: డీఈఐఈడీ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మొదటిసారి ఫెయిలైన విద్యార్థులు(2018–20) ఆగస్టు 4వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీఈఓ కె.సుభద్ర తెలిపారు. నాలుగు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, కేవలం ఒక సబ్జెక్టుకు రూ.100 అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 4వ తేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. అపరాధ రుసుం రూ. 50తో ఆగస్టు 19వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజులను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు చెల్లించాలని సూచించారు.